# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు





గ్రామాల్లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు, బైక్‌పై గ్రామాల్లో ప్రచారం చేస్తున్న తెల్లం

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 2: ఎన్నికల్లో ఆశీర్వదించి ఎన్నికల్లో గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని ఆలుబాక, తిప్పాపురం, పెంకవాగు, కలిపాక, బోదాపురం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. రైతు సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వమూ పని చేయలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే రైతు సంక్షేమ పథకాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రచారంలో నూగూరు ఏఎంసీ మాజీ చైర్మన్ బోదేబోయిన బుచ్చయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, పార్టీ నాయకులు గూడవర్తి నర్సింహ మూర్తి, ముడుంబ శ్రీనివాస్, ఆలుబాక సర్పంచ్ అది లక్ష్మి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం

భద్రాచలం, నవంబర్ 2: భద్రాచలం పట్టణంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. గురువారం పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెళ్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేసి డాక్టర్ తెల్లం వెంకట్రావును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. పదేళ్ల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు ప్రజల కోసం ఏమీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉందన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలకు మార్గం చూపేలా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఎక్కువ మంది గులాబీ గూటికి చేరుతున్నారన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ప్రచారంలో నాయకులు బొల్లా రాంబాబు, ఎండీ నవాబ్, చాట్ల రవికుమార్, లకావత్ వెంకటేశ్వర్లు, మల్లేల లోకేశ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే ప్రజల జీవితాల్లో వెలుగులు

## 1969 ఉద్యమ నాయకుడు తిప్పన సిద్ధులు



మాట్లాడుతున్న 1969 ఉద్యమ నాయకుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ తిప్పన సిద్ధులు

భద్రాచలం, నవంబర్ 2: బీఆర్ఎస్‌తోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని 1969 ఉద్యమ నాయకుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ తిప్పన సిద్ధులు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలే పార్టీకి అధికారాన్ని కట్టబెడతాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మ్యానిఫెస్టో సామాన్యులకు మేలు చేసేలా ఉందన్నారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల వివాహానికి 'కల్యాణలక్ష్మి, షాదీముబారక్', దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'దళిత బంధు', సొంత జాగా ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు 'గృహలక్ష్మి' పథకాలు అమలు చేస్తున్నదన్నారు. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏమీ చేయలేదని మండిపడ్డారు. కర్ణాటకలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను పక్కన పెట్టిందన్నారు. 24 గంటలు కరెంట్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కేవలం 5 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలవక ముందే ఆ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి కుర్చీ కోసం కొట్లాడుకుంటున్నారన్నారు. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డి.. ఇలా ఎవరికి వారు ముఖ్యమంత్రి పదవి తమకే వస్తుందని భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిత్యం కర్ఫ్యూలు, ఆందోళనలు, అల్లర్లు జరిగేవని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీ అట్టుడుకిపోయిన విషయం ప్రజలకు తెలుసన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడూ కర్ఫ్యూ వాతావరణం లేదన్నారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.



రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

## నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం, నవంబర్ 2 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం సీతారాములకు నిత్య కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవా కాలం, నిత్య హోమాలు, నిత్య పూజలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో స్వామివారికి కల్యాణం జరిపి, కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

దుమ్ముగూడెం, నవంబర్ 2: నర్సాపురానికి చెందిన విశ్రాంత ఆర్మీ సుబేదార్ రాజ గోపాలచారి కుమారుడు విశ్వేశ్వరరావు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం సమాచారం అందుకున్న జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి మృతుడి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారివెంట కణితి రాముడు, కామేశ్వరరావు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 2 : విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ హేమచంద్రబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. రామవరం, చిట్టిరామవరం, ప్రశాంత్‌నగర్, 2 ఇంక్లైన్, ఎస్‌సీబీ నగర్ ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 2 : మండలంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. లింగమూర్తి, మానేటి రాము, పల్లపు సమ్మయ్య, భూక్యా సాయిప్రకాష్, గుగులోత్ నరేశ్, ఉదయ్‌కుమార్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.40,900 నగదుతోపాటు ఆరు మొబైల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

## గోటి తలంబ్రాల వరి మొక్కలకు సీమంతం



వరి మొక్కలకు సీమంతం చేస్తున్న అధికారులు

భద్రాచలం, నవంబర్ 2: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం అర్చకులు, ఆలయ అధికారులు గోటి తలంబ్రాల వరి మొక్కలకు సీమంతం చేశారు. సీమంతం వెనుక కథ ఇదీ.. ఏపీలోని కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు 13 ఏళ్ల నుంచి భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలను సమర్పిస్తున్నారు. గోటి తలంబ్రాల కోసం ప్రత్యేకంగా వరి పండిస్తున్నారు. ఏటా శ్రీరామనవమి కొద్దిరోజులు ముందుగానే వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలను ఆలయ అధికారులకు అప్పగిస్తారు. నాట్లు వేసే రోజున కళాకారులు శ్రీరాముడు, హనుమంతుడు, జాంబవంతుడి వేషధారణలో పొలానికి వస్తారు. అలాగే పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో కొన్ని వరి పనలను కుండల్లో ఆలయానికి తీసుకువచ్చి సీమంత వేడుక నిర్వహిస్తారు. ఇదే కోవలో గురువారం వరి పనలకు ఆలయ అర్చకులు, అధికారులు సీమంతం చేశారు.

## డిగ్రీ చదివే వారికోసం స్పెషల్ ట్రైనింగ్

భద్రాచలం, నవంబర్ 2 : భద్రాచలం డివిజన్‌లో డిగ్రీ చదివే విద్యార్థుల కోసం ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఈ నెల 6న స్థానిక కూనవరం రోడ్డులో ఉన్న శ్రీ వీరభద్ర ఫంక్షన్‌హాల్లో ఒకరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు క్లబ్ డైరెక్టర్ ఇంటూరి భాస్కరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదిగురు, డాక్టర్ ఆదినారాయణరెడ్డి తదితరులు విద్యార్థులకు 'కీ' పాయింట్లపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గోల్ సెట్టింగ్, పబ్లిక్ స్పీకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, మెమరీ టెక్నిక్స్, మొబైల్ అడిక్షన్, హాబిట్ ఫార్మేషన్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఉదయం 9నుంచి సాయంత్రం 4: 30గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ తరగతులకు హాజరయ్యే వారికి భోజన సదుపాయం కల్పించామన్నారు.



సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

## పాలకుర్తి సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం

### 108 లీటర్ల ఆవు పాలతో స్వామివారికి అభిషేకం

పాలకుర్తి, నవంబర్ 2: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆరుద్రోత్రవం నిర్వహించారు. మేళతాళాలు అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మహా వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఏకాదశ రుద్రాభిషేకం కొనసాగించారు. 108 లీటర్ల ఆవు పాలతో స్వామివారిని అభిషేకించారు. అనంతరం గర్భాలయంలో దీపోత్సవం చేపట్టారు. సోమేశ్వరుడిని పుష్పాలతో అలంకరించిన అర్చకులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.